9న జాతీయ లోక్ అదాలత్

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం మార్చి 9వ తేదీన దేశవ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఏలూరు కోర్టు పరిధిలోని పోలీస్ శాఖ వారితో మంగళవారం న్యాయ సేవాధికార సంస్థ భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కోర్టులకు సంబంధించి క్రిమినల్ కేసుల పరిష్కారం నిమిత్తం చర్చించారు. 378 కేసులు రాజీయోగ్యమైన కేసులుగా గుర్తించడం జరిగిందని, ఈ కేసులు ఏలూరులోని వివిధ కోర్టుల్లో పెండింగ్ ఉన్నాయని, కావున కక్షిదారులు రాజీయోగ్యమైన అన్ని కేసుల్లో సంబంధిత కోర్టుల ద్వారా కాని, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా కాని రాజీ చేసుకోవడానికి ప్రీ లోక్ అదాలత్ సిటింగ్స్‌ను ఉపయోగించుకుని కేసుల సత్వరమే పరిష్కరించుకోవాలని రత్నప్రసాద్ తెలియజేశారు.

జగనన్న 'పద్దు' పలికేనా..!

- పోలవరం నిర్వాసితుల హామీలకు నిధులొచ్చేనా
- ముందుకు సాగని చింతలపూడి, తాడిపూడి సాగునీటి ప్రాజెక్టులు
- పడకేసిన డెల్టా ఆధునికీకరణకు కేటాయింపులుండేనా
- ఆక్వా, పామాయిల్, వరి రైతులకు ప్రోత్సాహకాలు దక్కేనా
- ఫిషింగ్ హార్బర్ అడుగులు ముందుకు పడేనా
- కొల్లేరు రెగ్యులేటర్ల నిర్మాణం పరిస్థితేమిటో
- దగ్గులూరు మెడికల్ కాలేజీ కాగితాలకే పరిమితమా
- నేడు అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వ మధ్యంతర బడ్జెట్

జగన్ సర్కార్ తన పదవీ కాలంలో చివరి బడ్జెట్‌ను బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టనుంది. నాలుగున్నరేళ్లుగా జిల్లాకు సంబంధించిన సాగునీటి ప్రాజెక్టులకుగాని, డెల్టా ఆధునికీకరణకుగాని, నిర్వాసితులకిచ్చిన హామీలకు నిధులు, ఆక్వా, పామాయిల్, వరి రైతులకు ప్రోత్సాహకాలుగాని సరిగ్గా కేటాయించని పరిస్థితి నెలకొంది. దీంతో జిల్లా అభివృద్ధి పూర్తిగా పడకేసింది. చివరి ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లోనైనా ఉమ్మడి జిల్లాకు నిధుల కేటాయింపు జరిగేనా అనే చర్చ సర్వత్రా సాగుతోంది. జగన్ పద్దు పలుకుతుందో.. లేదో మరో కొన్నిగంటల్లో తేలిపోనుంది.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వైసిపి సర్కార్ ఏర్పడి దాదాపు ఐదేళ్ల గడిచిపోయింది. ఇప్పటి వరకూ నాలుగు బడ్జెట్లను అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. బుధవారం ప్రవేశపెట్టబోయే ఓటాన్ అక్కౌంట్ బడ్జెట్‌తో చివరి బడ్జెట్. ఎన్నికల అనంతరం కొలువుదీరిన ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ను ప్రవేశపెట్టనుంది. 2019 ఎన్నికల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 15 అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాలుండగా 13 అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాలను వైసిపినే గెలుచుకుంది. అత్యధిక స్థానాలు కట్టబెట్టిన జిల్లాలో అభివృద్ధి పరుగులు తీస్తుందని జిల్లా ప్రజానీకం భావించారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలుగాని, జిల్లాలోని అభివృద్ధి ప్రాజెక్టులకుగాని, జిల్లాకు ఇచ్చే రాయితీలుగాని ఏ బడ్జెట్ నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం చేయలేదు. చివరి బడ్జెట్‌లోనైనా జిల్లాలోని ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులు ఉండేనా అనే చర్చ నడుస్తోంది. జిల్లాలో అత్యంత ముఖ్యమైనవి చింతలపూడి, తాడిపూడి ఎత్తిపోతల సాగునీటి ప్రాజెక్టులు. చింతలపూడి పూర్తయితే 4.60 లక్షల ఎకరాలకు, తాడిపూడి ప్రాజెక్టులో పిల్ల కాలువలు తవ్వితే 2.60 లక్షల ఎకరాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందుతుంది. దశాబ్దాలు గడిచినా ఈ ప్రాజెక్టులు పూర్తికాని పరిస్థితి నెలకొంది. 2008లో చింతలపూడి ప్రాజెక్టును రూ.1,701 కోట్లు అంచనా వ్యయంతో ప్రారంభించారు. గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టును కృష్ణా జిల్లాకు విస్తరించి 4.80 లక్షల ఎకరాలకు సాగునీరందించే ప్రాజెక్టుగా మార్చింది. దీనికి రూ.4,909 కోట్లు ఖర్చు కానున్నట్లు ప్రణాళికలు రచించారు. ఇప్పటికీ భూసేకరణ ప్రక్రియ పూర్తి కాలేదు. గడిచిన బడ్జెట్‌లో రూ.272 కోట్లు కేటాయించినా చేసిన ఖర్చు నామమాత్రమే. ఇప్పుడు ఈ ప్రాజెక్టు ఖర్చు రూ.9,800 కోట్లకు చేరినట్లు అంచనాలు వేశారు. ఇప్పటి వరకూ నాలుగువేల కోట్లు ఖర్చు చేసినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఆ ఖర్చు కూడా గత ప్రభుత్వాల హయాంలోనే జరిగింది. ఈ బడ్జెట్‌లో కనీసం రూ.1500 కోట్లు కేటాయిస్తే పనులు ముందుకు సాగే పరిస్థితి ఉండనుంది. మరో ఎత్తిపోతల పథకం తాడిపూడి 2004లో ప్రారంభమైంది. ఇప్పటికీ పూర్తిస్థాయిలో సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. పిల్లకాలువ తవ్వకాలు పూర్తిచేస్తే 2.60 లక్షల ఎకరాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందనుంది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.8,853 కోట్లు. ఇప్పటి వరకూ రూ.600 కోట్లు వరకూ ఖర్చు చేసిన పరిస్థితి ఉంది. మరో రూ.200 కోట్లు ఖర్చుపెడితే ప్రాజెక్టు పూర్తయ్యే పరిస్థితి ఉన్నా నిధులు కేటాయించడం లేదు. గత బడ్జెట్‌లో రూ.22 కోట్లు కేటాయించి మమ అనిపించారు. ఐదు ఎర్రకాలువ రిజర్వాయర్, తమ్మిలేరు రిజర్వాయర్ పనులకు సంబంధించి నిధుల కేటాయింపు సరిగా లేదు. గత బడ్జెట్‌లో ఎర్రకాలువ ప్రాజెక్టుకు రూ.8.43 లక్షలు మాత్రమే కేటాయించారు.

పడకేసిన డెల్టా ఆధునికీకరణ

రెండు జిల్లాల్లోనూ ఖరీఫ్, రబీల్లో దాదాపు పది లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. 11 ప్రధాన కాలువలు, 300కుపైగా పిల్ల కాలువల ద్వారా సాగునీరు సరఫరా అవుతోంది. 2007లో డెల్టా ఆధునికీకరణకు అప్పటి ప్రభుత్వం ఉమ్మడి జిల్లాకు రూ.1416 కోట్లకు ఆమోద ముద్రవేసింది. గత ప్రభుత్వాల హయాంలో రూ.800 కోట్ల వరకూ ఖర్చు పెట్టారు. ఇంకా రూ.600 కోట్లు ఖర్చుచేస్తే డెల్టా ఆధునికీకరణ పూర్తి కానుంది. వైసిపి ప్రభుత్వం వచ్చాక డెల్టా ఆధునికీకరణ పనులను పూర్తిగా పక్కన పెట్టేసింది. గతేడాది బడ్జెట్‌లో కేవలం జిల్లాకు రూ.12 కోట్లు మాత్రమే కేటాయించారు. తూడు, గుర్రపుడెక్క వంటివి తీయడానికి కూడా నిధులు సరిపోని పరిస్థితి ఉంది. దీంతో వర్షాలకు ప్రతియేటా వేలాది ఎకరాల్లో పంట దెబ్బతింటుంది. రబీలో సాగునీటి ఎద్దడి తలెత్తే సమస్య వెంటాడుతోంది. ఈ బడ్జెట్‌లోనైనా నిధులు కేటాయిస్తారో, లేదో వేచిచూడాలి.

పోలవరం నిర్వాసితుల హామీలకు నిధులొచ్చేనా

తాము అధికారంలోకి వస్తే పోలవరం నిర్వాసితులకు ఇస్తున్న రూ.6.25 లక్షల పునరావాస ప్యాకేజీని రూ.పది లక్షలకు పెంచుతామని, 2006కు ముందు సేకరించిన భూములకు ఎకరాకు రూ.ఐదు లక్షలు ఇస్తామని, 18 ఏళ్లు నిండిన యువతకు పరిహారం ఇస్తామని, ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామని, భూమికి భూమి అందిస్తామని వైసిపి చెప్పింది. నాలుగున్నరేళ్లు గడిచినా నిర్వాసితులకు పరిహారం అందించలేదు. ప్రాజెక్టులో కాఫర్‌డ్యామ్ పూర్తి చేయడంతో ప్రతియేటా కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని 107 గ్రామాల్లో 20 వేల కుటుంబాలు గోదావరి వరద ముంపుబారిన పడి కొండలు, గుట్టలపై కాలం వెళ్లదీశాయి. గత ఆగస్టులో వచ్చిన వరదల సమయంలో కుక్కునూరు మండలం గొమ్ముగూడెం వచ్చిన సిఎం జగన్ 2024 జనవరి, ఫిబ్రవరి నెల్లో హామీ ఇచ్చిన ప్రకారం పరిహారం అందిస్తామని ప్రకటించారు. ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తేనే అది సాధ్యమవుతుంది.

ఫిషింగ్ హార్బర్, కొల్లేరు రెగ్యులేటర్ల నిర్మాణం, దగ్గులూరు మెడికల్ కాలేజీలకు నిధులు దక్కేనా

నరసాపురం మండలం బియ్యపుతిప్పలో ఫిషింగ్ హార్బర్, కొల్లేరులోకి సముద్రపు నీరు ప్రవేశించకుండా మూడు రెగ్యులేటర్ల నిర్మాణం చేపడతామని, పార్లమెంట్ స్థానం పరిధిలో మెడికల్ కాలేజీలో భాగంగా పాలకొల్లు మండలంలోని దగ్గులూరు వద్ద మెడికల్ కాలేజీ నిర్మిస్తామని ప్రకటించింది. ఇప్పటి వరకూ పనులు ప్రారంభం కాలేదు. ప్రతి బడ్జెట్‌లోనూ నిధుల కేటాయింపులు లేకుండాపోయాయి. ఈ బడ్జెట్‌లోనైనా నిధులు కేటాయిస్తారా అనే చర్చ నడుస్తోంది. ఆక్వా యూనివర్సిటీని ప్రారంభించినా భవనాల నిర్మాణం మాత్రం జరగలేదు. పూర్తిస్థాయిలో నిధులు కేటాయిస్తేనే వచ్చే ఏడాదికైనా సొంత భవనాల్లో ప్రారంభించుకునే అవకాశం ఉంటుంది.

ఆక్వా, పామాయిల్, వరి రైతులకు ప్రోత్సాహకాలు లభించేనా

జిల్లాలో రెండున్నర లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు, లక్షన్నర ఎకరాల్లో పామాయిల్, దాదాపు రెండు పంటల కింద పది లక్షల ఎకరాల్లో వరి సాగవుతున్నాయి. ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీని కుదించడంతోపాటు మేత ధరలు పెరిగిపోవడం, రొయ్య ధర తగ్గిపోవడంతో ఆక్వా సాగు తీవ్ర ఇబ్బందుల్లో కూరుకుపోయింది. ఆక్వా రైతులను ఆదుకునేలా ఎటువంటి ప్రోత్సాహకాలూ లేకుండా పోయాయి. పామాయిల్ రైతులదీ అదే పరిస్థితి. వరి రైతులకు బోనస్ వంటివి ఇవ్వడంలో ఎటువంటి చర్యలూ లేకుండా పోయాయి. ముఖ్యంగా వైసిపి ప్రభుత్వంలో కౌలురైతుల పరిస్థితి మరింత దిగజారింది.



కలెక్టరేట్ వద్ద ధర్నాలో నినదిస్తున్న మున్సిపల్ కార్మికులు

సమ్మె హామీలపై జిఒలు ఇవ్వండి

కలెక్టరేట్ వద్ద మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన 16 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలకు వెంటనే జిఒలు విడుదల చేయాలని, ఇంజినీరింగ్ విభాగం వర్కర్లకు స్కిల్డ్, సెమీ స్కిల్డ్ జీతాలు ఇవ్వాలని, క్లాప్ ఆటోల డ్రైవర్లకు కనీస వేతనం రూ.18,500 ఇవ్వాలని కోరుతూ మంగళవారం మున్సిపల్ కార్మికులు ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన ఈ ధర్నానుద్దేశించి యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం 2023 డిసెంబర్ 26 నుండి జనవరి పదో తేదీ వరకూ 16 రోజులు రాష్ట్రవ్యాప్త సమ్మె నిర్వహించినట్లు తెలిపారు. సమ్మె విరమణ సందర్భంగా ప్రభుత్వం కార్మిక సంఘాలతో ఒప్పందం చేసుకుందని, దానికి అనుగుణంగా మినిట్స్ కాపీ ఇచ్చిందని తెలిపారు. 16 అంశాలపై ఇచ్చిన మినిట్స్ కాపీకి అనుగుణంగా జిఒలు విడుదల చేయలేదని తెలిపారు. దీంతో కార్మికులు తీవ్ర నిరాశలో ఉన్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమ్మె విరమణ ఒప్పందానికి అనుగుణంగా జిఒలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మరోసారి మున్సిపల్ కార్మికులు సమ్మెకు సన్నద్ధమవుతారని ఆయన హెచ్చరించారు. ధర్నాకు యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.బాలరాజు, ప్రధాన కార్యదర్శి ఎ.జాన్‌బాబు, నేతలు లావేటి కృష్ణారావు, వెంకటేష్, రాజు, పెంటయ్య, వినుకొండ రమేష్ నాయకత్వం వహించారు. అనంతరం యూనియన్ ప్రతినిధి బృందం కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం సమర్పించారు.

హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలి

రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మాట్లాడుతున్న గోపీ

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బిఎన్ఎస్ 106 (1)(2) హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోపీ డిమాండ్ చేశారు. రవాణా రంగ కార్మిక సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం మంగళవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగింది. గోపీ మాట్లాడుతూ ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు దానికి డ్రైవర్లనే బాధ్యులుగా చేయడం సమంజసం కాదని, మానవ తప్పిదాల వల్ల జరుగుతున్న ప్రమాదాలు పది శాతం మాత్రమేనని అన్నారు. రోడ్డు ప్రమాదాలపై జరిగిన అధ్యయనాలను పరిశీలించి కేంద్ర ప్రభుత్వమే ఈ గణాంకాలను ప్రకటించిందని తెలిపారు. ప్రముఖ ప్రొఫెసర్ గీతం తివారి ఢిల్లీలో రోడ్డు ప్రమాదాలపై అధ్యయనం చేసి మానవేతర కారణాల వలన 90 శాతం ప్రమాదాలు జరుగుతున్నాయని రుజువు చేశారన్నారు. మన దేశంలో ప్రమాదాలపై శాస్త్రీయ విచారణ జరగదని, ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్లనే తప్పు పట్టడం సర్వసాధారణమైందని విమర్శించారు. 1860 బ్రిటీష్ పాలనాకాలంలో సెక్షన్ 304ఎ ప్రకారం రెండు సంవత్సరాల వరకు మాత్రమే జైలు శిక్ష ఉండేదని, తాజాగా మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన బిఎన్ఎస్ 106 (1)(2) ప్రకారం 10 సంవత్సరాల జైలుశిక్ష, రూ.10 లక్షల వరకు జరిమానా విధించేలా చట్టాన్ని తీసుకురావడమేనా భారతీయత అని ప్రశ్నించారు. డ్రైవర్లను ఆందోళనకు గురి చేస్తున్న హిట్ అండ్ రన్ చట్టాన్ని బేషరతుగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రవాణా రంగంలో పనిచేసే కార్మికులందరికీ కేంద్ర ప్రభుత్వమే సమగ్ర సంక్షేమ చట్టాన్ని తీసుకురావాలని, తద్వారా రవాణా రంగ కార్మికుల కుటుంబాలను కాపాడాలని కోరారు. ఈ సమావేశానికి చక్రాల అమర్‌కుమార్ అధ్యక్షత వహించగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ఎఐటియుసి నాయకులు కె.కన్నబాబు మాట్లాడుతూ దేశంలో 10 కోట్ల మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పిస్తున్న రవాణా రంగం పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించారు. రవాణా రంగ కార్మికులను ఆదుకునేందుకు ప్రభుత్వాలు సహాయపడకపోగా డ్రైవర్లకే ఉరితాడు బిగించే విధంగా తీసుకొచ్చిన హిట్ అండ్ రన్ చట్టాన్ని బేషరతుగా రద్దు చేయాలని, లేనిపక్షంలో ఈ నెల 16న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెలో రవాణా రంగ కార్మిక సంఘాలను కలుపుకుని డ్రైవర్లంతా కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం తెలియజేస్తారని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య, ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.సుందరయ్య, ఏలూరు ఆటోనగర్ ప్రెసిడెంట్ అరుణతార నాగేశ్వరరావు, మైత్రి ట్యాక్సీ డ్రైవర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు పాలిమెట్ల కరుణాకర్ సిఐటియు ఆటో యూనియన్ నాయకులు బుద్ధ నాగసూర్యబాబు పాల్గొన్నారు.

పేదలకు ఆధునిక కంటి పరీక్ష సేవలు

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ - రూ.27 లక్షలు విలువైన ఆధునిక సామగ్రి ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు

కంటిచూపు సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు కంటి వైద్య సేవలు ఉచితంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కంటివెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తుందని జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి కంటివైద్య విభాగంలో సుమారు రూ. 27 లక్షలు విలువైన కంటి పరీక్షలకు సంబంధించిన ఆధునిక సామగ్రిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ కంటిచూపు సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు ఉచితంగా కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా మేలైన కంటిచూపును పొందేలా ప్రభుత్వ ఆసుపత్రి కంటివిభాగంలో ఆధునిక పరీక్షలకు అవసరమైన పరికరాలను ఏర్పాటు చేశారన్నారు. కంటి పరీక్షతోపాటు కళ్ల అద్దాలు, ఉచితంగా మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. మొదటి ప్రాధాన్యతగా ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన పారిశుధ్యం ఉండాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వాసుపత్రిలో డాక్టర్లు, నర్సులు, సిబ్బంది ఆసుపత్రులకు వచ్చే రోగులపట్ల ప్రేమాభిమానాలతో సేవలందించాలని కోరారు. ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యు.అగ్నేస్ విజయ ఆధునిక కంటి వైద్య పరికరాల గురించి మాట్లాడుతూ గ్లకోమా (నీటి కాసులు) వ్యాధి తీవ్రత, పురోగతిని తెలియజేసే పెరిమీటర్ సుమారు రూ.11 లక్షలు, మెల్ల కన్ను వ్యాధిని నిర్ధారించే పరికరం సైనాప్టోఫోర్ సుమారు రూ.2 లక్షలు, కార్పొరేట్ స్థాయి ఎల్‌సిడి చూపు నిర్ధారణ పరికరాలు మూడు ఒక్కొకటి రూ.40 వేలు, రెటీనా పరీక్షలు డయాబెటిక్ రెటినోపతి లాంటివి పరీక్ష చేసే ఇన్ డైరెక్ట్ ఆప్తాల్మోస్కోప్ తదితర పరికరాల గురించి వివరించారు. అనంతరం కలెక్టర్ స్వయంగా కంటి పరీక్షలు చేయించుకున్నారు. కంటి పరీక్షల విభాగాన్ని, వార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏలూరు ప్రభుత్వాసుపత్రి కంటి విభాగం డాక్టర్ మల్లికార్జున్, డిసిహెచ్ పాల్ సతీష్‌కుమార్, డాక్టర్లు, నర్సులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేయించుకుంటున్న కలెక్టర్

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో రానున్న సార్వత్రిక ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేలా అధికార యంత్రాంగం సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో మంగళవారం ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై పునశ్చరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నుంచి వచ్చే మార్గదర్శకాలను క్షుణ్ణంగా చదివి, అర్థం చేసుకుని, జాగ్రత్తగా ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పనులకు తొలి ప్రాధాన్యతనిస్తూ ఎక్కడా ఎటువంటి పొరపాటు జరగకుండా జిల్లా ఎన్నికల నిర్వహణ ప్రణాళికను అమలు చేయాలన్నారు. జిల్లాలో అన్ని మండలాల్లోని పోలింగ్ కేంద్రాలను సంబంధిత తహశీల్దార్లు, ఎంపిడిఒ, ఎస్‌హెచ్‌ఒలు పది రోజులల్లోపు సందర్శించి సంయుక్త తనిఖీ నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇపి, జెండర్ రేషియోను కూడా పరిశీలించాలని, ఓటరు జాబితాలో మరణించిన వారి పేర్లు లేకుండా సరిచూసుకోవాలన్నారు. తుది జాబితా విడుదల చేసిన కారణంగా ముందుగా విచారణ చేసి జిల్లా ఎన్నికల అధికారి అనుమతితో మాత్రమే తొలగింపుకు చర్యలు తీసుకోవాలన్నారు. చెక్ పోస్టులను పటిష్టంగా నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా మ్యాన్ పవర్, ఎన్నికల శిక్షణ, మెటీరియల్ మేనేజ్ మెంట్, ట్రాన్స్ పోర్ట్, స్వీప్ కార్యక్రమాలు, ఇవిఎం మేనేజ్ మెంట్, ఎన్నికల వ్యయం, పోస్టల్ బ్యాలెట్, మీడియా రిలేషన్స్, తదితర అంశాలకు సంబంధించి ఆయా నోడల్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగంపై తక్కువ నిడివిగల షాట్ ఫిల్ములు, తదితర వాటిని సేకరించి ఉత్తమ వాటిని ప్రోత్సహించే చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా ఎస్‌పి డి.మేరీ ప్రశాంతి మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో రెవెన్యూ, పోలీస్ శాఖల సమన్వయం ఎంతో కీలకమన్నారు. జిల్లాలో ఎన్నికలను చక్కటి వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు అందరూ కృషి చేయాలన్నారు. శాంతి భద్రతల విషయంలో మండల తహశీల్దార్లు స్థానిక పోలీసులతో సమన్వయం చేసుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి మాట్లాడుతూ ఆయా విభాగాలకు చెందిన నోడల్ అధికారులు వారికి నిర్దేశించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఓటర్ల తమ ఫిర్యాదుల నమోదు కోసం ప్రత్యేకంగా 1950 టోల్ ఫ్రీ నెంబరుపై అవగాహన పరచాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్‌పి ఎన్.సూర్యచంద్రరావు, జిల్లా రెవెన్యూ అధికారి డి.పుష్పమణి, ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజ, జెడ్‌పి సిఇఒ కెఎస్ఎస్.సుబ్బారావు, ఆర్‌డిఒలు ఎన్ఎస్‌కె.ఖాజావలి, ఎ.అద్దయ్య పాల్గొన్నారు.

వీడని పులి భయం..!

మళ్లీ ఉడతపల్లిలో ఆవుదూడపై దాడి - బెంబేలెత్తుతున్న గిరిజనులు

ప్రజాశక్తి - పోలవరం, బుట్టాయగూడెం

జిల్లావాసులను పులి భయం వీడటం లేదు. రెండు వారాలుగా ఏజెన్సీ మండలాలతోపాటు ద్వారకాతిరుమల, దెందులూరు మండలాల పరిధిలో పులి సంచరించిన సంగతి తెలిసిందే. ద్వారకాతిరుమల మండలం, బుట్టాయగూడెం మండలాల పరిధిలో ఆవుదూడలపై దాడి చేసిన సంగతి తెలిసిందే. అనంతరం పులి అభయారణ్యంలోకి వెళ్లిపోయిందని అటవీ శాఖాధికారులు సోమవారం ప్రకటించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే తాజాగా మంగళవారం తెల్లవారుజామున పోలవరం మండలం ఉడతపల్లిలో ఆవుదూడపై దాడి చేసి చంపడం తీవ్ర భయాందోళనకు గురి చేసింది. ఈ ఘటనతో మళ్లీ ఏజెన్సీవాసులు ఉలిక్కిపడ్డారు. పులి సంచారంతో వ్యవసాయ పనులు చేసుకోవడానికి రైతులు భయపడుతున్నారు. మరోపక్క గిరిజనులు అడవిలోకి వెళ్లేందుకు వెనుకాడాల్సిన దుస్థితి నెలకొంది. తాజా ఘటనతో పులి మళ్లీ అభయారణ్యంలోకి వెళ్లకుండా జనారణ్యంలోకి వస్తుందేమోనని బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. అటవీశాఖాధికారులు ఇప్పటికైనా నామమాత్రపు చర్యలతో సరిపెట్టకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టి పులిని పట్టుకుని అభయారణంలో విడిచిపెట్టాలని జిల్లావాసులు కోరుతున్నారు.

వికలాంగ విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత

ఏలూరు: వికలాంగుడైన మైలే డేవిడ్ జార్జి ప్రైస్ విద్యార్థికి మంగళవారం ఏలూరు జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ కార్యాలయంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా విభిన్న ప్రతిబావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ అధికారిణి రాకాడ మహి ల్యాప్ టాప్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వికలాంగ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ల్యాప్ టాప్ సౌకర్యం కల్పించిందని, ఇందులో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ మండలం కోటలపర్రు గ్రామానికి చెందిన బిఎస్‌సి మూడవ సంవత్సరం చదవుతున్న మైలే డేవిడ్ జార్జి ప్రైస్‌కి ల్యాప్ టాప్ అందించడం జరిగిందని ఆమె తెలిపారు. అనంతరం మైలే డేవిడ్ జార్జి ప్రైస్ మాట్లాడుతూ వికలాంగ విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ల్యాప్ టాప్ వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. ల్యాప్ టాప్ కోసం గతంలో దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం తమకు ల్యాప్‌టాప్ మంజూరు చేయించి, తమ విద్యకు మేలు చేకూర్చిందని తెలియజేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

పౌరసరఫరా సంస్థలో అవినీతిపై దర్యాప్తు చేయాలి : వ్యకాస

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పౌరసరఫరా సంస్థలో జరుగుతున్న అవినీతిపై సమగ్ర దర్యాప్తు జరపాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం స్థానిక అన్నే వెంకటేశ్వర భవనంలో సంఘం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు జీవరత్నం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ పౌర సరఫరాల సంస్థ ద్వారా పేదలందరికీ రేషన్ ఇవ్వడంలో జిల్లా అధికారులు వైఫల్యం చెందారని విమర్శించారు. పౌరసరఫరాల సంస్థలో అవినీతి తాండవిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు కందిపప్పు, గోధుమపిండి సక్రమంగా ఇవ్వడం లేదని మండిపడ్డారు. ఆహార భద్రత చట్టాన్ని తుంగలోకి తొక్కి నిత్యవసరాలను అక్రమ దారులకు కట్టబెట్టే ప్రయత్నం జిల్లా పౌరసరఫరాల సంస్థ చేస్తుందని ఎద్దేవా చేశారు. పేదలకందాల్సిన గోధుమపిండి, కందిపప్పు పందికొక్కుల్లా తింటున్న అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమ రవాణాల ద్వారా ప్రయివేట్ ఏజెన్సీలకు పౌరసరఫరాల సంస్థ ద్వారా కందిపప్పు మాయమవుతుందన్నారు. ఒక నెల గోధుమపిండి, మరొక నెల కందిపప్పు ఇస్తూ రేషన్ ఇస్తున్నామని ఆర్భాటంగా ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం సరఫరా చేసే కందిపప్పు, గోధుమపిండి, పంచదార, బియ్యంలో ఏ ఒక్కటీ సక్రమంగా ప్రజలకు అందడం లేదని తెలిపారు. జిల్లాలో 27 మండలాల్లో ఇదే తంతు జరుగుతుందని, దీనిపై జిల్లా కలెక్టర్ కలగజేసుకొని సమగ్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎ.రవి, తామ ముత్యాలమ్మ, మడకం సుధారాణి, జిల్లా కమిటీ సభ్యులు అందుగుల ప్రభాకర్, యాగంటి సీత, దాసు, సత్యనారాయణ పాల్గొన్నారు.

29లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

జోన్-2 సంయుక్త కార్మిక కమిషనర్ ఎ.రాణి

ఏలూరు అర్బన్: జోన్-2 పరిధిలోని దుకాణాలు, వాణిజ్య వ్యాపార సంస్థల యాజమాన్యాలు, భవన, ఇతర నిర్మాణ రంగ సంస్థలు ఈనెల 29వ తేదీలోపు ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ చట్టం 2015 కింద రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొంది ఉండాలని జోన్-2 సంయుక్త కార్మిక కమీషనర్ ఎ.రాణి కోరారు. ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక కార్మిక శాఖ కార్యాలయంలో వివిధ వర్తక, వాణిజ్య యాజమాన్య సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇది వరకే ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ చట్టం 2015 కింద రిజిస్ట్రేషన్ చేసుకున్న సంస్థలు వాటి రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్లను రెన్యూవల్ చేసుకోవాలని కూడా కోరారు. రిజిస్ట్రేషన్/రెన్యూవల్‌కు యజమానులు, కాంట్రాక్టర్లు సమీపంలోని మీ-సేవ కేంద్రాలు, సిఎస్‌సి సెంటర్లు, సచివాలయాలలో సంప్రదించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప కార్మిక కమీషనర్ పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముదినేపల్లి తహశీల్దార్‌గా కుమారి

ముదినేపల్లి: మండల తహశీల్దార్‌గా ఎస్ఎల్ఎన్.కుమారి మంగళవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. తూర్పుగోదావరి జిల్లా సామర్లకోట తహశీల్దార్‌గా పనిచేస్తున్న కుమారి ఎన్నికల నేపథ్యంలో జరిగిన బదిలీల్లో భాగంగా ముదినేపల్లి వచ్చారు. ఇక్కడ తహశీల్దార్ పనిచేస్తున్న కె.శ్రీనివాస్ పశ్చిమగోదావరి జిల్లా ఉండి తహశీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన కుమారిని రెవెన్యూ అధికారులు, విఆర్ఓలు అభినందించారు. అనంతరం ఆమె ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపిపి సత్యనారాయణ మాట్లాడుతూ మండలాన్ని మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేయాలని తహశీల్దార్‌కు సూచించారు.

ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

ఏలూరు అర్బన్: ఇంటర్మీడియట్ ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు మంగళవారం జిల్లావ్యాప్తంగా ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా వృత్తి విద్యాధికారి బి.ప్రభాకర్‌రావు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 12 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షలకు ఉదయం 894 మందికి 777 మంది హాజరయ్యారు. 117 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 691 మందికి 617 మంది హాజరవ్వగా 74 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 1,585 మందికి 1394 మంది హాజరవ్వగా 191 మంది గైర్హాజరయ్యారు.

వాటర్ ట్యాంకు పరిశీలన

పోలవరం : పాఠశాల వాటర్ ట్యాంకులో జంతు కళేబరం పేరిట వచ్చిన వార్త కథనానికి మంచి స్పందన లభించింది. కొయ్యలగూడెం ఉపవిద్యా శాఖ అధికారి రామన్న దొర ఆదేశాల మేరకు గూటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కెవి.రాఘవన్ పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు లక్ష్మీకాంతం వాటర్ ట్యాంకులు పరిశీలించారు. ఈ సందర్భంగా రాఘవన్ మాట్లాడుతూ ఆ ట్యాంక్‌ని గతంలో సత్యసాయి మంచినీటి కోసం వినియోగించే వారని, పాఠశాలకు ఆర్వో ప్లాంట్ వచ్చిన నేపథ్యంలో వాటర్ ట్యాంకును వాడడం లేదని, నిరుపయోగంగా ఉన్న ట్యాంకులో పిల్లి పడి చనిపోవడం వల్ల దుర్వాసన వచ్చిందని తెలిపారు.

9న నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ

భీమడోలు: పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఈనెల 9వ తేదీన నిర్వహిస్తున్న నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమం విజయవంతం చేయాలని భీమడోలు మండల విద్యాధికారి-2 భాస్కర్ కుమార్ కోరారు. ఆయన మంగళవారం పొలసానిపల్లి గ్రామంలోని ఎంపిపి ప్రాథమిక పాఠశాల నెంబర్ ఒకటి, రెండులను సందర్శించారు. వివిధ అంశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. విద్యార్థులు పోషక విలువలతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని పాఠశాలలోనే స్వీకరించే విధంగా పదార్థాలను తయారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు తులసి పాల్గొన్నారు.

8న సర్వే ల్యాండ్ రికార్డ్స్ సమావేశం

నూజివీడు రూరల్: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రెవెన్యూ డివిజన్ పరిధిలోని సర్వేయర్లతో మంగళవారం సమీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారి లక్ష్మణరావు మాట్లాడుతూ సర్వే సందర్భంగా క్షేత్రస్థాయిలో ఏర్పడే సమస్యలను అధిగమించేందుకు సాంకేతిక నైపుణ్యాన్ని వినియోగించాలన్నారు. ఈనెల 8వ తేదీన సర్వే ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్ సమావేశానికి అందరూ సిద్ధం కావాలన్నారు.

టిడిపిలో ఎవ్వరూ చేరలేదు : సర్పంచి

చింతలపూడి: మండలంలోని చింతపల్లి పంచాయతీ పరిధిలో అధిక సంఖ్యలో వైసిపి వారు టిడిపిలో చేరినట్లు వస్తున్నట్లు వార్తలు అసత్యమని చింతపల్లి సర్పంచి రామకృష్ణ అన్నారు. చింతంపల్లి సర్పంచి ఇంటి వద్ద వైసిపి నాయకుల, కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి వారు అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఖండించారు. వైసిపికి చింతంపల్లి కంచుకోటన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులకు పాల్గొన్నారు.

విద్యార్థులు కుటుంబ విలువలు కాపాడాలి

భీమడోలు: విద్యార్థులు తమ కుటుంబ విలువలను కాపాడుకోవడం ద్వారా లక్ష్యసాధనకు మరింత చేరువవుతారని భీమడోలు శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపల్ డి.సోహిని అన్నారు. పాఠశాలలో కుటుంబ విలువల ప్రాముఖ్యతను వివరించే క్రమంలో ఫ్యామిలీ ఫెస్ట్-2024 కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రులను గౌరవించడంతో పాటు వారి పెద్దలకు సైతం గౌరవం ఇవ్వాలని, వారి సలహాలు సూచనలు పాటించాలని కోరారు. అనంతరం విద్యార్థులు కార్యక్రమంలో భాగంగా తమ తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను సత్కరించి, వారి ఆశీస్సులు స్వీకరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురుని ఆకట్టుకున్నాయి.

ముసునూరు ఇఒపిఆర్‌డిగా శ్రీనివాసరావు

ముసునూరు: మండల ఇఒపిఆర్‌డిగా ఎస్‌వి.శ్రీనివాసరావు బాధ్యతలను చేపట్టారు. కాకినాడ జిల్లా కరప మండలం నుంచి ఆయన ఇక్కడికి బదిలీపై విచ్చేశారు. ఇక్కడ ఇఒపిఆర్‌డిగా పనిచేసిన సత్యనారాయణ కాకినాడ జిల్లా కరప మండలానికి బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావుని పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది స్వాగతం పలుకుతూ అభినందనలు తెలిపారు. ముసునూరు మండలంలో పంచాయతీల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు ఆయన విలేకరులకు తెలియజేశారు.

11న జాతీయ కవి సమ్మేళనం

ఏలూరు అర్బన్: సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవాసంస్థ కళా వేదిక ఈనెల 11వ తేదీన కొయ్యలగూడెంలో జాతీయ తెలుగు సాహిత్య సదస్సు 129వ జాతీయ కవి సమ్మేళనం జరపనున్న నేపథ్యంలో కార్యక్రమ బ్రోచర్‌ని మంగళవారం రాష్ట్ర సాహిత్య అకాడమీ ఛైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి ఆవిష్కరించారు. ఈ బ్రోచర్ ఆవిష్కరణలో పాల్గొన్న వారిలో కళావేదిక రాష్ట్ర కార్యదర్శి శ్రీహరికోటి, ఆర్గనైజింగ్ కార్యదర్శి గురుశర్మ, కో-కన్వీనర్ ఎంజె.సుజయ్ కృష్ణ పాల్గొన్నారు.

నేరాలు – ఘోరాలు

కారు ఢీకొని వ్యక్తి మృతి

బుట్టాయగూడెం : బుట్టాయిగూడెం మండలం కొవ్వాడ బ్రిడ్జి సమీపంలో రెడ్డిగూడెం గ్రామంకు చెందిన కోపల వెంకటరెడ్డి(32) ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటరెడ్డి కొవ్వాడ గ్రామానికి చెందిన మహేంద్ర స్కోర్పియో కారు ఢీకొన్నాడు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఏలూరు స్పోర్ట్స్: జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగర శివారు జాతీయ రహదారి రత్నాస్ దాబా హోటల్ సమీపంలో మంగళవారం సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయసున్న వ్యక్తి గుర్తుతెలియని వాహనం ఢీకొనటంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతుని వివరాలు తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న ఏలూరు రూరల్ పోలీసులు మృతదేహాన్ని సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చోరీ కేసులో నిందితుని అరెస్ట్

నూజివీడు రూరల్: నూజివీడు పట్టణంలోని హనుమాన్ జంక్షన్ రోడ్డులో ఉన్న ఐటిసి టెక్నో డ్యూ కంపెనీలో సోమవారం అర్ధరాత్రి దొంగతనం జరిగిందని ఫిర్యాదు మేరకు పోలీసులు నిందుతున్ని మంగళవారం అరెస్టు చేశారు. వివరాల్లోకెళితే ఐటిసి డ్యూ కంపెనీలో అర్ధరాత్రి దొంగలు పడ్డారని, బీరువాలో ఉంచిన రూ.90 వేల నగదు చోరీ అయినట్లు కంపెనీ ప్రతినిధి ఏలూరు టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు వేగంగా దర్యాప్తు చేసి చోరీ చేసిన కాగితాల జోసెఫ్ రాజు(26)ను పట్టుకున్నట్లు డిఎస్‌పి అశోక్ కుమార్ గౌడ్ తెలిపారు. వేగంగా పోలీసులు దర్యాప్తు చేసి, జోసఫ్ రాజును అరెస్ట్ చేసి రూ.90 వేలు రికవరీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందిని డిఎస్‌పి అభినందించారు.

మర్రిబంధంలో చోరీ

నూజివీడు రూరల్: మండలంలోని మర్రిబంధం గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున షేక్ సైదా ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధితుడు పోలీసులకు తెలిపిన వివరాల ప్రకారం ఇంటికి తాళం వేసి బంధువుల ఇళ్లకు వెళ్లి రాగా వచ్చేసరికి తాళాలు పగలగొట్టి ఉన్నాయన్నారు. బీరువాను పరిశీలించగా రూ.70 వేల నగదు, నాలుగు తులాల బంగారం, కాళ్ల పట్టీలు చోరీకి గురయ్యాని పేర్కొన్నాడు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పోలింగ్ కేంద్రాల్లో కనీస సదుపాయాలపై దృష్టి సారించాలి

80 ఏళ్లు దాటిన వారికి ఇంట్లో నుంచే ఓటు వేసే అవకాశం

తహశీల్దార్లు, ఎంపిడిఒ, రాజకీయ నేతలతో ఆర్‌డిఒ సమీక్ష

ప్రజాశక్తి - ఉంగుటూరు

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగు కేంద్రాల్లో కనీస సదుపాయాలపై బిఎల్ఒలతో పాటు అధికారులు దృష్టి సారించాలని ఏలూరు ఆర్‌డిఒ, నియోజకవర్గ ఓటు నమోదు సహాయ అధికారి ఎస్‌కెఎన్ ఖాజావలి అన్నారు. మంగళవారం ఉంగుటూరు తహశీల్దారు కార్యాలయంలో నాలుగు మండలాల తహశీల్దార్లు, ఎంపిడిఒలు, రాజకీయ నాయకులతో వారాంతర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ 80 ఏళ్లు దాటిన సీనియర్ సిటిజన్‌కి ఈసారి ఇంటి నుంచే ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించనుందని, దీనిపై రాజకీయ పార్టీ నాయకులు, బిఎల్ఒలు పిఎస్‌ల వారీగా సమాచారం సేకరించాలని కోరారు. నియోజకవర్గంలో 214 పోలింగు కేంద్రాల్లో 205334 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో డిలీషన్స్ రేషియో పాయింట్ ఫైవ్ లోపు కలెక్టరు పరిధిలో ఉందని, అంతకు మించితే రాష్ట్ర ఎన్నికల అధికారికే (సిఇఒ) ఆ అధికారం ఉందన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ తేదీకి పది రోజుల ముందు వరకే చనిపోయిన వారి ఓట్లు రద్దు చేసే అవకాశం ఉంటుందన్నారు. ముసాయిదా జాబితాలో తప్పులు లేకుండా ఉండేందుకు రాజకీయ పార్టీలు పోలింగు ఏజెంట్ల సాయంతో పరిశీలన చేయాలని కోరారు. గత ఎన్నికల్లో పలు కేంద్రాల్లో తాగునీరు, నీడ వసతులు కల్పనలో కొద్దిపాటి ఇబ్బందులు వచ్చాయని, ఈసారి ఉత్పన్నం కాకుండా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని టిడిపి నుంచి బాలానందం ఆర్‌డిఒ దృష్టికి తెచ్చారు. ఓటర్ల జాబితా వెరిఫికేషన్‌లో వాలంటీర్లు పాల్గొంటున్నారని టిడిపి నాయకుడు విజయ్‌కుమార్ అన్నారు. ఎన్నికల విధుల్లో వాలంటీర్లకు స్థానం లేదని ఆర్‌డిఒ చెప్పారు. బిజెపి నుంచి శరణాల మాలతీరాణి, అడపా శోభారాణి, వైసిపి నుంచి పాపారావు బాబ్జి, సిపిఎం నుంచి కొర్ని అప్పారావు, ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, ఉంగుటూరు తహశీల్దారు శివయ్య, ఎంపిడిఒ శర్మ, భీమడోలు, నిడమర్రు, అధికారులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలపై సమీక్షిస్తున్న ఆర్‌డిఒ

మహిళా సంక్షేమానికి పెద్దపీట

నాలుగో విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో వైసిపి ఇన్‌ఛార్జి తెల్లం రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మహిళా సంక్షేమానికి వైసిపి పెద్దపీట వేస్తుందని ఆ పార్టీ పోలవరం నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి అన్నారు. జీలుగుమిల్లి సొసైటీ ఆవరణలో మంగళవారం జరిగిన నాలుగో విడత వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడిచిన నాలుగన్నరేళ్లలో వైసిపి ప్రభుత్వం మహిళల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ఆ పథకాలకు కూడా ఎటువంటి ప్రలోభాలు లేకుండా నేరుగా వారి అకౌంట్‌ల లోకే నగదును జమ చేసినట్లు గుర్తు చేశారు. మహిళల పట్ల ఆయనుకున్న సానుభూతితో మహిళా రిజర్వేషన్‌లో భాగంగా మహిళనైన నాకు ఎంఎల్ఎ టిక్కెట్ కేటాయించారని తెలిపారు. మీరందరూ పెద్ద మనసు చేసుకొని నన్ను గెలిపిస్తే మహిళా సంక్షేమానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళలకు ప్రతి ఏటా అందిస్తున్న వైఎస్ఆర్ ఆసరా నాలుగో విడత రూ.3 కోట్ల 12 లక్షల చెక్‌ను డిఆర్‌డిఎ పీడీ విజయరాజుతో కలిసి లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కొర్స పోసమ్మ, జెడ్‌పిటిసి వసంతరావు, సర్పంచులు చిర్రి జగదాంబ, సున్నం ఉషారాణి పాల్గొన్నారు.

భీమడోలు : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని సంక్షేమ ఫలాల ప్రదాతగా ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు అభివర్ణించారు. భీమడోలు హైస్కూలు కేంద్రంగా మంగళవారం భీమడోలు, అంబరుపేట, సూరప్పగూడెం, పొలసానిపల్లి గ్రామాలకు చెందిన డ్వాక్రా సంఘాలకు నాలుగో విడత రుణమాఫీ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. గ్రామ సర్పంచి పి.సునీత మాన్సింగ్ అధ్యక్షతన ఆసరా సంబరాలు పేరిట నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఎల్ఎతో పాటు, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జి.పద్మశ్రీ హాజరయ్యారు. రుణమాఫీ చెక్కులను అందుకున్న మహిళలు తమ ఆనందోత్సవాలను నృత్య రూపంలో, ఆటలు, పాటల రూపంలో ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలు పలువురుని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి తుమ్మగుంట భవాని రంగ, ఎంపిపి కనమాల రామయ్య, భీమడోలు సొసైటీ అధ్యక్షులు ఆర్.సత్య శ్రీనివాస్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.


జీలుగుమిల్లి : చెక్కులు పంపిణీ చేస్తున్న ఇన్‌ఛార్జి రాజ్యలక్ష్మి

పేదల అభివృద్ధికి జగన్మోహన్‌రెడ్డి కృషి

సర్పంచి మెండ ఝాన్సీ

మండవల్లి: పేద ప్రజల అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది కేవలం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని మండవల్లి సర్పంచి మెండ ఝాన్సీ స్పష్టం చేశారు. స్థానిక సచివాలయంలో జరుగుతున్న జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్‌లను మంగళవారం ఆమె దగ్గరుండి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదలు రాష్ట్రంలో ఉండకూడదనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జగనన్న ఇళ్ల స్థలాల పేరుతో ప్రతి పేదవాడికి స్థలం పంపిణీ చేయడం జరిగిందన్నారు. పేదల అభివృద్ధికి, రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న జగనన్నకు రానున్న రోజుల్లో అందరూ అండగా ఉండాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ కమల్ హసన్, డిజిటల్ అసిస్టెంట్ మెండ సురేష్ పాల్గొన్నారు.

10న సంకల్ప సభను విజయవంతం చేయాలి

టి.నరసాపురం: ఈనెల 10న అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో జరిగే దళితవాడ ప్రత్యేక పంచాయతీ సాధన సంకల్ప సభను విజయవంతం చేయాలని అంబేద్కర్ ఇండియా మిషన్ (ఎయిమ్) రాష్ట్ర నాయకులు దూబా విల్సన్, బి.నాగేంద్ర, అర్జా సాగర్, జి.నాగరాజులు మంగళవారం పత్రికా ప్రకటన ద్వారా పిలుపునిచ్చారు. దళిత గ్రామాలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేయాలనే నినాదంతో ఎయిమ్ పనిచేస్తుందన్నారు. దళిత వాడలు ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పడితే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 75 ఏళ్ల దాటినా దళిత గ్రామాల అభివృద్ధి లేదన్నారు. సంకల్ప సభకు మండలంలోని అన్ని గ్రామాల దళిత యువత కదిలి రావాలని, జయప్రదం చేయాలని కోరారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు ఆనందదాయకం : హెచ్‌ఎం

కొయ్యలగూడెం: ఏలూరులో జరిగిన ప్యారేడ్‌లో విద్యార్థులు చాటిన ప్రతిభకు సర్టిఫికెట్లు రావడం ఎంతో ఆనందదాయకంగా ఉందని ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి తెలిపారు. రిపబ్లిక్ డే సందర్భంగా ఏలూరులో జరిగిన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా తరపున పాల్గొన్న కొయ్యలగూడెం మండలం పరింపూడి జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బొల్లా దుర్గ రాణిని అభినందించారు.

నిలిచిన ఆర్‌టిసి బస్సు

ప్రయాణికుల ఇక్కట్లు

ప్రజాశక్తి - ముసునూరు

ఏలూరు నుంచి నూజివీడు వెళ్లు ఎపిఆర్‌టిసి బస్సులోని ప్రయాణికులు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన ముసునూరులో బ్రేక్ ఫెయిల్ అయ్యి బస్సు ఆగిపోవడంతో ప్రయాణికులు పలు ఇబ్బందిలు పడ్డారు. చాలా సమయం వరకు వేచి చూసినప్పటికి బస్సు రిపేరు కాకపోవడంతో ప్రయాణికులు ప్రయివేటు వాహనాల్లో తమ గమ్య స్థానాలకు చేరుకున్నారు.

మీడియాపై దాడికి కారకులపై చర్యలు తీసుకోవాలి

ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యాన అడిషనల్ ఎస్‌పికి వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఈనెల 5వ తేదీన మీడియాపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యాన మంగళవారం జిల్లా అడిషనల్ ఎస్‌పికి వినతిని అందించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ఈనెల 5న సోమవారం చింతలపూడిలో టిడిపి 'రా కదలి రా' సభ ఏర్పాట్లు చేస్తున్న సందర్భంగా కవరేజ్‌కి వచ్చిన జర్నలిస్ట్ సీనియర్ నాయకులు కెఎస్.శంకరరావు, సీనియర్ జర్నలిస్ట్ రమణారావుపై దెందులూరు మాజీ ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్, అతని అనుచరులు దాడి చేసి, సెల్ ఫోన్లను లాక్కొని తీవ్ర పదజాలంతో దుర్భాషలాడారని తెలిపారు. సదరు మీడియాపై జరిగిన దాడిని ఖండిస్తూ భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా దాడి చేసిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర సీనియర్ నాయకులు కె.బాలశౌరి, ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌డి.జబీర్, వైవి.హరీష్, జిల్లా ఉపాధ్యక్షులు పి.గంగరాజు, శేఖర్, కార్యవర్గ నిర్వాహక కార్యదర్శి బి.విజయ్ కుమార్, దాస్, మిల్టన్, స్టాలిన్ పాల్గొన్నారు.

పోలవరం: చింతలపూడిలో జరిగిన రా కదిలి రా బహిరంగ సభలో దెందులూరు మాజీ ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ విలేకరులపై చేసిన దౌర్జన్యాన్ని ఖండించాలంటూ ఎపిడబ్ల్యుజెఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి పూనం చిన్న బుచ్చన్న దొర, జిల్లా జాయింట్ సెక్రెటరీ కుంజం రాంబాబు, పోలవరం ప్రెస్‌క్లబ్ ప్రెసిడెంట్ సొబ్బన రాజశేఖర్ బాబు, ప్రెస్ క్లబ్ సభ్యులు కలిసి పోలవరం తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ ప్రసాద్‌కి వినతిని అందించారు. క్లబ్ ప్రెసిడెంట్ రాజశేఖర్ మాట్లాడుతూ ఈనెల 5న జరిగిన టిడిపి సభలో చింతమనేని ప్రభాకర్ పత్రికా విలేకరులపై చేసిన దౌర్జన్యాన్ని ఖండించాలని, ఫోన్ లాక్కోవడం, దురుసుగా ప్రవర్తించడం చాలా దురదృష్టకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలవరం ప్రెస్ క్లబ్ సభ్యులు, వైస్ ప్రెసిడెంట్ తులసి వెంకట్రావు, సెక్రెటరీ కందుల రాము, జాయింట్ సెక్రెటరీ డి.సుధాకర్ రాజు పాల్గొన్నారు.

ఏలూరు : ఎస్‌పికి వినతినిస్తున్న ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు

ఆరోగ్య సురక్ష సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - భీమడోలు

మారుమూల కొల్లేరు ప్రాంతాలకు సైతం అందుబాటులోనికి వచ్చిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య సేవలను వినియోగించుకోవాలని చెట్టున్నపాడు గ్రామ సర్పంచి జెవి.నరసమ్మ, ఎంపిటిసి వి.సుజాత కోరారు. వివిధ అంశాల్లో నిపుణులైన వైద్య ప్రముఖుల సేవలను సద్వినియోగ పరుచుకోవాలని తెలిపారు. గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను గుండుగొలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ కె.శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. కీలకమైన ప్రసూతి వైద్య సేవలను భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రానికి చెందిన వైద్య పర్యవేక్షకులు డాక్టర్ ఎన్.సునీత ఆధ్వర్యంలో అందుబాటులోనికి తెచ్చారు. సుమారు 467 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీతో పాటు, ఇతర ఉన్నత స్థాయి వైద్యం అందజేసేందుకు సిఫార్సులు చేశారు. ఈ కార్యక్రమంలో భీమడోలు పంచాయతీ విస్తరణ అధికారి ఎ.సుందరి,పంచాయతీ కార్యదర్శి డి.వెంకట్రావు పాల్గొన్నారు.

ముసునూరు: ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అందరినీ ఆదుకుంటున్నారని చింతలవల్లి సర్పంచి పిల్లి సత్యనారాయణ అన్నారు. మంగళవారం మండలంలోని చింతలవల్లి గ్రామంలో ఆరోగ్య వెల్‌నెస్ సెంటర్ వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్-2 కార్యక్రమం ఎంపిడిఒ సిహెచ్ పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించారు. వైద్యులు షాకినా హివాంజిలీ, భవాని వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఆఫీస్ ఎఒ కూచిపూడి సాయిరామ్, పంచాయతీ కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పిఎసిఎస్ అధ్యక్షులుగా సత్య వరప్రసాద్

మండవల్లి : మండవల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన అధ్యక్షులుగా గుడివాడ సత్య వరప్రసాద్(బాబి) మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు బాధ్యతలు చేపట్టిన బొమ్మనపోయిన గోకర్ణ యాదవ్ పదవీకాలం పూర్తవడంతో సత్య వరప్రసాద్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఛైర్మన్‌గా సత్యవర ప్రసాద్, డైరెక్టర్లుగా చొప్పరపు విజయ్ కుంచె చింతాలు ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటూ, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపుతూ, సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. అంతేకాకుండా పరపతి సంఘం ఆధ్వర్యంలో రైతులకు అందించాల్సిన సేవలను సత్వరమే అందించే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు. నాపై నమ్మకం ఉంచి అధ్యక్షులుగా నియమించినందుకు కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరావుకి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన్ని గ్రామానికి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, సిబ్బంది పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కైకలూరు మార్కెట్ యార్డ్ కమిటీ ఛైర్మన్ చేబోయిన వీర్రాజు, ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వరప్రసాద్‌ను సత్కరిస్తున్న గ్రామ ప్రముఖులు

చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలి

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేసి దాని ద్వారా ఆంధ్ర కాల్వకు నీరందించాలని సిపిఐ సీనియర్ నాయకులు మామిళ్లపల్లి వసంతరావు అన్నారు. చింతలపూడి మండలం సమ్మెటవారి గూడెం గ్రామంలో చింతలపూడి ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న ఆయకట్టు రైతుల సమావేశం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వసంతరావు మాట్లాడుతూ తక్షణం చింతలపూడి ఎత్తిపోతల పథకం ఫేజ్-1, ఫేజ్-2 పూర్తి చేసి మెట్ట ప్రాంతానికి నీరందించాలని, ముఖ్యంగా చింతలపూడి ఎత్తిపోతల పథకం మెయిన్ కెనాల్ నుంచి ఆంధ్ర కాల్వకు నీటిని సరఫరా చేయడం ద్వారా దాని కింద ఉన్నటువంటి 27 చెరువులకు నీరు అందుతుందని 7 వేల ఎకరాల ఆయకట్టు అభివృద్ధి చెందుతుందని అన్నారు. దీని ద్వారా గనిజర్ల, ఎండపల్లి, మల్లాయగూడెం, పోతునూరు గ్రామాలకు తాగునీరు, సాగునీరు అందుతుందని, కావున చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేసి ఆంధ్ర కాలువకు నీరందించాలని కోరారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఇరిగేషన్ డిఇ అర్జున్ రావు మాట్లాడుతూ ఆంధ్ర కాలువ పూడిక తీయడానికి ఎంపీ నిధులతో ఎస్టిమేట్ వేశామని, అది ప్రపోజ్లో ఉందన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం మెయిన్ కెనాల్ పూర్తైన తర్వాత దాని ద్వారా ఆంధ్ర కాలువ ప్రారంభంగా ఉన్నటువంటి తుమ్మూరుకి మెయిన్ కెనాల ద్వారా సబ్ కెనాల్ ఏర్పాటు చేయడానికి రూ.40 కోట్లతో ఎస్టిమేట్ వేశామని, మెయిన్ కెనాల్ పూర్తైన తర్వాత ఇది ప్రారంభం అవుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పుల్లూరు సోమశేఖర్, లక్ష్మణరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంత కృష్ణ, సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, తోర్లపాటి బాబు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించడం అభినందనీయం

మండవల్లి: విద్యతోపాటు ఆటల్లో కూడా రాణించి గ్రామానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావడం అభినందనీయమని కానుకొల్లు సర్పంచి నాగదాసి థామస్ అన్నారు. కానుకొల్లులో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గ్రామీణ ప్రాంత యువతలోని క్రీడలను వెలికి తీసే విధంగా ఆడుదాం ఆంధ్ర అనే కార్యక్రమాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. కానుకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై రాష్ట్రస్థాయిలో నిర్వహించిన టెన్నికాయిట్ ఆటలో అత్యుత్తమమైన ఆటను ప్రదర్శించి కాంస్య పథకాన్ని సాధించారని తెలిపారు. కాంస్య పథకం సాధించిన విద్యార్థులను, ఆటలో తర్ఫీదిచ్చిన ఉపాధ్యాయుడిని గ్రామ ప్రముఖులు, పలువురు నాయకులు అభినందించారు.

'చంద్రబాబుది కపట ప్రేమ'

టి.నరసాపురం: చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు వ్యవసాయం దండగ అని చెప్పి నేడు అధికారంలోకి రావడానికి రైతుల పట్ల కపట ప్రేమ చూపిస్తున్నారని వైసిపి రైతు విభాగం జిల్లా అధ్యక్షులు వాసిరెడ్డి మధు విమర్శించారు. చింతలపూడిలో జరిగిన రా కదలిరా సభలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులను ఉద్దేశించి మాట్లాడినవన్నీ అబద్ధాలు, పూర్తి అవాస్తవాలని అన్నారు. మంగళవారం కె.జగ్గవరం సొసైటీలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు తాను అధికారంలో ఉండగా ఆయిల్‌ఫామ్ రైతులకు టన్నుకు రూ.18 వేలు ఇచ్చానని పచ్చి అబద్ధాలు చెప్పారన్నారు. అవాస్తవాలు మాట్లాడితే ప్రజలు ఊరుకోరన్నారు.

హెచ్‌ఎం రామకృష్ణ సస్పెండ్

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి మండలం రాఘవపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రామకృష్ణని సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్ సుందర్ తెలిపారు. నాడు-నేడు సిమెంట్ బస్తాలు అవకతవకలు గుర్తించి సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

In the Court of the Ist Addl. Junior Civil Judge, Bhimavaram
I.A. No. 316/2023 in O.S. No. 296/2023

పిటిషనరు/వాది:
Saripidakala Ramakrishna
రెస్పాండెంటు/ప్రతివాది:
Meragani Appa Rao, S/o. Appa Rao, Flat No. S-3, Subhadra Residency, Srirampuram, Bhimavaram-2

పై నెంబరు దావాలో I.A. No. 316/2023 (Or 38 R 5) నెంబరులో రెస్పాండెంటుకు నోటీసులు శ్రీ కోర్టు వారి ద్వారాను, రిజిష్టర్డ్ పోస్టు ద్వారాను అనేక పర్యాయములు పంపించినను సదరు రెస్పాండెంటు ఉద్దేశ్యపూర్వకంగా అందుకొని యుండుటలేదు. కాబట్టి రెస్పాండెంటుకు నోటీసులు అమలు నిమిత్తం **ది. 23-02-2024 సంll తేదీకి వాయిదా వేసినారు. సదరు తేదీన ఉదయం 10.30 నిll లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించబడునని యిందుమూలముగా తెలియజేయడమైనది.

పిటిషనరు తరపు అడ్వకేటు
R.SRINIVASA MURTHY
Advocate, Bhimavaram
భీమవరం
03-02-2024 Cell: 9948122644

In the Court of the Ist Addl. Junior Civil Judge, Bhimavaram
O.S. No. 296/2023

వాది:
Saripidakala Ramakrishna
ప్రతివాది:
Meragani Appa Rao, S/o. Appa Rao, Flat No. S-3, Subhadra Residency, Srirampuram, Bhimavaram-2

పై నెంబరు దావాలో ప్రతివాదికి దావా సమన్లు అనేక పర్యాయములు శ్రీ కోర్టు వారి ద్వారాను, రిజిష్టర్డ్ పోస్టు ద్వారాను పంపించినను సదరు ప్రతివాది ఉద్దేశ్య పూర్వకంగా అందుకొని యుండుటలేదు. కాబట్టి ప్రతివాదికి దావా సమన్లు అమలు నిమిత్తం **ది. 23-02-2024 సంll తేదీకి వాయిదా వేసినారు. సదరు తేదీన ఉదయం 10.30 నిll లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడునని యిందుమూలముగా తెలియజేయడమైనది.

పిటిషనరు తరపు అడ్వకేటు
R.SRINIVASA MURTHY
Advocate, Bhimavaram
భీమవరం
03-02-2024 Cell: 9948122644

వేలం ప్రకటన
మహారాజశ్రీ భీమడోలు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి. నెం. 23/2022
ఒ.యస్. నెం. 83/2021

Between:
బీళ్ళ నారాయణరావు -డిక్రీ హోల్డర్/వాది
మరియు
1) ఇందుకూరి నాగలక్ష్మి
2) గాదంశెట్టి లక్ష్మికుమారి
-జేడీఆర్స్/ప్రతివాదులు

ఈ పై నెంబరు గల గ్రంధములో ఇ.పి. వారంటు బాకీ వసూలు నిమిత్తము జేడీఆర్స్ యొక్క దిగువ షెడ్యూల్ ఆస్తిని భీమడోలు జూనియర్ సివిల్ జడ్జి వారు ది. 22-02-2024వ తేదీన ఉదయము 10.30 నిll లకు భీమడోలు, జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు ఎదుట వేలము వేయుచున్నారు. వేలములో పాల్గొనువారు **ది. 22-02-2024వ తేదీన ఉదయము 10.30 నిll లకు** సదరు వేలములో పాల్గొనవచ్చును. పూర్తి వివరములకు డిక్రీ హోల్డర్ ప్లీడర్ గారిని సంప్రదించవచ్చును.

షెడ్యూల్: పశ్చిమగోదావరి జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, దెందులూరు మండలం, ఏలూరు సబ్ రిజిష్ట్రీ, గోపన్నపాలెం గ్రామము, దాఖలా ఆర్.ఎస్. నెం. 283/2, డోర్ నెం. 2-24, అసెస్మెంట్ నెం. 174, దాఖలా చుll గుll 0-72 లు ఆర్.సి.సి. బిల్డింగ్‌నకు హద్దులు.
తూర్పు: రోడ్డు. **దక్షిణము:** ఏనుగు వెంకాయమ్మ గారి స్థలము. **పడమర:** జంగారెడ్డిగూడెం రోడ్డు. **ఉత్తరము:** ఏనుగు బలే రాములు గారి స్థలము.
డిక్రీ హోల్డర్ విలువ: రూ. 15,00,000/-
అమీనా విలువ: రూ. 20,00,000/-

జి.వి.రవికుమార్
ఏలూరు డి.హెచ్.ఆర్. అడ్వకేట్, భీమడోలు
07-02-2024 సెల్: 9440183345